ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



జనం.. వనం బాట..

భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

లక్షలాదిగా మేడారం తరలొస్తున్న భక్తులు

మహా జాతరకు సమయం సమీపిస్తోంది. బుధవారం జరిగిన మండమెలిగే పండుగతో జాతర సందడి రెట్టింపయ్యింది. ఇప్పటికే నెలరోజులుగా ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు సమ్మక్క సారలమ్మ గద్దెల చెంతకు తరలొస్తుండగా.. ఆ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటివరకు 30లక్షలమంది అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని, గురువారం లక్షమందికి పైగా వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. జనం వనం బాట పడుతుండటంతో మేడారం ప్రాంతం సందడిగా మారుతోంది. ఓ వైపు భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న తాత్కాలిక గుడారాలు, చిరు వ్యాపారుల అంగళ్లతో కళకళలాడుతోంది. మరోవైపు 21వతేదీ నుంచి నాలుగురోజులపాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు కోటి మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కాలుష్య రహిత జాతర కలేనా?

పొగ, దుమ్ముతో మేడారంలో గాలి కలుషితం

- వాహనాల రద్దీ, జాతరలో వెలిగించే కట్టెల పొయ్యిలే ప్రధాన కారణం
- సాధారణ గాలికంటే 3 నుంచి 5 రెట్లు అధికంగా పొల్యూషన్
- చిన్నపిల్లలు, అస్థమా, గుండె వ్యాధి బాధితులకు తీవ్ర ఇబ్బందులు
- గ్యాస్, కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించాలని నిపుణుల సూచన

వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతర్పై కాలుష్యం పడగ విప్పుతోంది. లక్షలాది మంది భక్తులు వచ్చే మహాజాతరలో వాహన కాలుష్యంతో పాటు దుమ్ము, కట్టెల పొయ్యి పొగ భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. సాధారణంగా పీల్చుకునే గాలి కంటే జాతర సమయంలో 3నుంచి 5రెట్లు గాలి కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. 2020, 2022లో మేడారం జాతరలో గాలితోపాటు జంపన్నవాగు నీటిపై కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ బృందం పరిశోధనలు చేస్తోంది. జంపన్నవాగులో నీరు ప్రవాహం ఉండటంతో పెద్దగా కలుషితం కావటం లేదు. కానీ, గాలిలో మాత్రం కాలుష్యం విపరీతంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, అస్థమా రోగులకు ప్రమాదకరంగా మారనుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం పెరగకుండా ముందు జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టిసారిస్తేనే భక్తుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

కాలుష్యం కట్టడికి కానరాని చర్యలు

మేడారం మహాజాతరకు ఏటా కోటిన్నర మంది భక్తులు వస్తారని ప్రభుత్వం ప్రకటిస్తుంది. అలాగే ఐదారు రాష్ట్రాల నుంచి భక్తులు 8లక్షలకు పైగా ప్రవేటు వాహనాలను మేడారం తీసుకవస్తున్నారు. వీటితో పాటు ఈ ఏడాది ఆరువేల ఆర్టీసీ బస్సులు జాతరకు రానున్నాయి. ద్విచక్ర వాహనాలు వేలల్లో జాతర దారిపట్టనున్నాయి. జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం జాతరను ముంచెత్తుతుంది. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేచి గాలిలో కలిసిపోతుంది. ఇదే గాలిని ప్రాణవాయువుగా పీల్చుకుని భక్తులు లేనిపోని రోగాలను తెచ్చుకుంటున్నారు. మేడారం జాతర ప్రాంగణం నుంచి నార్లాపూర్, చింతల్, హెలీప్యాడ్ ప్రాంతం, కన్నెపల్లి, ఊరట్టం, జంపన్నవాగు, తాడ్వాయి వెళ్లే దారి, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల పార్కింగులతో భారీగా దుమ్ములేస్తుంటుంది. అలాగే జాతరకు వచ్చే భక్తులు కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటారు. ఈ కట్టెల పొయ్యితో వచ్చే పొగ క్యాన్సర్కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముంచెత్తుతున్న కాలుష్యం

మేడారం జాతరలో కాలుష్యం సాధారణంగా ఉండే దానికంటే అధికంగా మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సాధారణం గా నేషనల్ యాం బి యంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్ఏ ఏక్యూఎస్) ప్రకారం 10 పీఎం (10 మైక్రో మీటర్ల కంటే తక్కువ ఏరోడైనమిక్ వ్యాసం కలిగిన పర్టిక్యులేట్ మ్యాటర్) కంటే 3 నుంచి 5 రెట్లు ఎక్కువ గా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. 2020 మహాజాతర సందర్భంగా గాలి కాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. జాతరకు వారం ముందు, జాతర జరిగే నాలుగు రోజులు, జాతర ముగిసిన వారం రోజులకు ఈ శాంపిల్స్ సేకరించారు. గత జాతరలో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) 50పీఎంలోపు ఉంటే లోపు ఎలాంటి ప్రమాదం ఉండదు. కానీ, 51 నుంచి 400ఏక్యూఐ ఉంటే సున్నితమైన వ్యక్తులు, చిన్న పిల్లలకు శ్వాస ఇబ్బందులు ఎదురవుతాయని, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చిన్నపిల్లలు, వృద్దులు శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడుతారని, దీర్ఘకాలం శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 401కంటే ఎక్కువ ఏక్యూఐ ఉంటే ఆరోగ్యవంతులు కూడా అనారోగ్యం పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కాలుష్య నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. 2020 జాతరలో గాలి నాణ్యత సూచిక 327 పీఎం నుంచి 408 వరకు నమోదైంది. సాధారణంగా కంటే 3 నుంచి 5రెట్లు అధికంగా గాలి కలుషితమైనట్లుగా అధికారులు గుర్తించారు. 2022 జాతరలో గాలి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శాంపిల్స్ తీయలేదని సమాచారం. ప్రస్తుతం మళ్లీ జాతరకు సంబంధించి శుక్రవారం నుంచి గాలి కాలుష్యంపై పరీక్షలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది. ప్రస్తుతం వాహనాల సంఖ్య భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో ఈసారి మరింత గాలి కాలుష్యం పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా పర్యావణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి పెడితేనే..

ప్రభుత్వం మహాజాతరలో ప్లాస్టిక్పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ప్రతీ జాతరకు ఫ్రీప్లాస్టిక్ జాతర అంటూ ప్రచారం చేయడం.. జాతర ప్రారంభం కాగానే పట్టించుకునే వారు ఉండరు. అయితే అత్యంత ప్రమాదకరమైన గాలి కాలుష్యంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా వాహనాల రాకపోకల నేపథ్యంలో దుమ్ము లేవకుండా నిత్యం నీటిని రోడ్లపై చల్లుతూ ఉండాలని, అలాగే మురికి రోడ్లపై కంకర వేయటం, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎక్కువ పొగను వెదజల్లే వాహనాలను జాతరకు రాకుండా కట్టడి చేయాలని, కట్టెల పొయ్యిపై వంటలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాసను వినియోగించేలా చూడాలని, అడవులను నరికివేయకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే జాతర గద్దెలకు దూరంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఆ పార్కింగ్ స్థలాలు కూడా విశాలంగా ఉండటంతో పాటు అందులో తారురోడ్లు లేదా సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో దుమ్ము లేచే అవకాశాలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

గద్దెల సమీపంలోని హోటళ్లలో కట్టెల పొయ్యిల వాడకంపై నిషేధం విధించాలని, కిరోసిన్తో కూడా వంటల తయారీని నియంత్రించేటువంటి చర్యలతో కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించటంతో కూడా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడితేనే మహాజాతరలో కాలుష్యాన్ని తగ్గించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడినట్లు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి భక్తులకు తెలియకుండానే మేడారం మహాజాతరలో కాలుష్యం విషపూరితమై మానవ జీవనంపై ప్రభావం చూపిస్తుందని, కాలుష్యాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వివరాలు 4లో..

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

- 15 మందితో ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రి సీతక్క



సీతక్కతో.. ప్రమాణ స్వీకారం చేసిన మహాజాతర ఉత్సవ కమిటీ

మేడారం, ఫిబ్రవరి 15 : మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మేడారంలో గురువారం అట్టహాసంగా జరిగింది. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీని నియమించింది. ఈనెల 12 నుంచి 25వరకు దీని కాలపరిమితిని నిర్ణయించింది. కమిటీ చైర్మన్గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 13 మందితోపాటు ఎక్స్అఫీషియో సభ్యుడిగా ప్రధాన పూజారి జగ్గారావును నియమించారు. మొత్తం 15మందితో జాతర ఉత్సవ కమిటీ కొలువుదీరింది. మంత్రి సీతక్క సమక్షంలో దేవాదాయశాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఈ కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు సకల సౌకర్యాలు రూపకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కోటి 50లక్షలకు పైగా భక్తజనం మహాజాతరకు తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను

మిగతా 4వ పేజీలో..

రోడ్డు ప్రమాదంలో

భార్య మృతి, భర్తకు గాయాలు



సంపత్ నవ్యశ్రీ (ఫైల్)

నర్మెట, ఫిబ్రవరి 15: భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్మెట మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన దంపతుల్లో భార్య అక్కడికక్కడే మృతిచెందగా భర్తకు గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వెల్దండ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొల్లం సంపత్కు మంచిర్యాల జిల్లా నవ్యశ్రీ(22)కి గత సంవత్సరం క్రితం వివాహం జరిగింది. వీరు జీవనోపాధి కోసం హైదరాబాద్లో ఉద్యోగం చేసుకుంటూ ఉంటున్నారు. గ్రామంలో తమ ఇంటి వద్ద సమ్మక్క పండుగను జరుపుకునేందకు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తు న్నారు. ఈ క్రమంలో భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో భార్య నవ్యశ్రీ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా భర్త సంపత్కు తీవ్ర గాయాలయ్యాయి. పండగకు ఇంటికి వస్తున్న దంపతులకు రోడ్డు ప్రమాదం జరగడంతో వెల్దండ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఓ యువకుడు..

చిలుపూర్ : ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని నష్కల్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐనవోలు మండలం నందనం పరిధిలోని రాంనగర్కు చెందిన ఎమ్డీ రషీద్ (23) అనే యువకుడు తన కుటుం బ సభ్యులతో కలిసి చిలుపూర్ మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్లారు. తిరుగు పయనంలో కుటుంబ సభ్యులంతా వెనకాల కారులో వస్తుండగా, రషీద్ తన ద్విచక్రవాహనం (స్కూటీ)పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నష్కల్ సమీపంలో జాతీయ రహదారిపై ఓ పంక్చర్ షాపు వద్ద అప్పటికే ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు స్కూటీ ఢీకొట్టింది. దీంతో రషీద్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారమందుకున్న పోలీసులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి జబ్బార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంకెల గారడీగా మునిసిపల్ బడ్జెట్

బడ్జెట్పై కౌన్సిలర్ల విమర్శలు

రూ.27. 43 కోట్ల పద్దుకు ఆమోదం



సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: మునిసిపల్ వార్షిక బడ్జట్ తలాతోక లేకుండా ఉందని పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. అంకెల గారడీతో మమ అనిపించారని ఆరోపించారు. గురువారం జనగామ మునిసిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ పోకల జమున అధ్యక్షతన 2024-25 మునిసిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.27 కోట్ల 43 లక్షల అంచాన బడ్జెట్ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు. బడ్జెట్ ఆమోదానికి ముందు బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు అనేక అంశాలను లేవనెత్తారు. పలు విషయాలపై అధికారులను నిలదీశారు. బీజేపీ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్తా మాట్లాడుతూ.. ఆస్తి పన్నును రూ.కోటి వరకు పెంచి చూపించారని, పన్ను పెంపునకు సంబంధించిన వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. అంకెల మార్పుతో గారడీ చేశారే తప్ప బడ్జెట్తో కొత్తదనమేమీ లేదన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి గతంలో మునిసిపాలిటీకి స్టాంప్ డ్యూటీ ఆదాయం కోట్లలో వచ్చేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆదాయాన్ని తీసుకోవడం వల్ల మునిసిపల్కు ఆదాయం తగ్గిందన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ.. మునిసిపల్ ఆదాయం పెరగాలంటే ట్రేడ్ లైసెన్సులు వసూలు చేయాలని, జంతువధ శాల నుంచి స్టాంపు వేసిన వాటిని మాత్రమే మార్కెట్లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు జక్కుల అనిత, వంగాల కల్యాణి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే లేకుండా బడ్జెట్ సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రాంప్రసాద్, మేనేజర్ రాములు, శానిటరీ ఇన్స్పెక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష

హాజరు కానున్న 4, 361 మంది విద్యార్థులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 15: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 16న ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంటర్ బోర్డు ఇంగ్లీషు సబ్జెక్టుకు ఈ సంవత్సరం నుంచి ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నది. ఫస్టియర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనుండగా వచ్చే ఏడాది సెకండియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ స్ట్రీమ్, ఒకేషనల్ స్ట్రీమ్ తో కలిపి మొత్తం 4,361 మంది ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షకు హాజరు కానున్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షల సంబంధిత కళాశాలల్లోనే సబ్జెక్టు అధ్యాపకుడే నిర్వహిస్తారు.

ఈ పరీక్షకు గాను జనరల్ విద్యార్థులకు 20 మార్కులు, ఒకేషనల్ విద్యార్థులకు 10 మార్కులు కేటాయించారు. విద్యార్థులను 50 మందికి ఒక బ్యాచ్ చొప్పున ఏర్పాటు చేసి ఉదయం 9 గంటల నుంచి ఒక్కో బ్యాచ్కు గంట పాటు ప్రాక్టి కల్ పరీక్ష నిర్వహిస్తారని ఇంటర్ జిల్లా అధికారులు తెలిపారు.

పెండింగ్లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి

జనగామ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలో పాడి రైతులకు పెండింగ్లో ఉన్న పాల బిల్లులకు వెంటనే చెల్లించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి అన్నారు. ఈ మేరకు శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గంలో పాల ఉత్పత్తి ఎక్కువగా జరుగుతుందని అన్నారు. గత రెండు నెలలుగా నియోజకవర్గంలోని పాడి రైతులకు పాల డబ్బులు రాలేదని సభ దృష్టికి తీసుకువెళ్లారు. పాల బిల్లులు రాకపోవడం వల్ల పాడి మీద వచ్చే ఆదాయంతోనే జీవనం గడిపే పేద రైతులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో పలు చోట్ల రైతులు పోసిన పాలను నాణ్యత లేమి పేరుతో తిప్పిపంపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాడి రైతులకు ఇచ్చే 4 శాతం ఇన్సెంటివ్ డబ్బులు కూడా రావడం లేదని అన్నారు. జనగామ నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల రెండు నెలలుగా పాల బిల్లులు, 4శాతం ఇన్సెంటివ్ రావడం లేదని అన్నారు. పాడి మీదనే ఆధారపడే కుటుంబాలు ఉన్నందున ఇతరత్రా బిల్లులు ఆపేసి అయినా పాల బిల్లులు, ఇన్సెంటివ్లు చెల్లించాలని కోరారు.

నిర్మించారు.. వదిలేశారు..



రఘునాథపల్లిలోని సెగ్రిగేషన్ షెడ్డు

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

నీరుగారుతున్న లక్ష్యం..కొత్త ప్రభుత్వంపై ఆశలు


రఘునాథపల్లి, ఫిబ్రవరి 15: పల్లె సీమలు దేశానికి పట్టుకొమ్మలు అన్న జాతిపిత మహాత్మాగాంధీ అన్న లక్ష్యాన్ని నెరవేర్చడంలో భాగంగా.. పల్లెలు స్వయం సమృద్ధి సాధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. ఆశయం ఘనం..ఆచరణ శూన్యం అన్న చందంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం మారిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.. కనీసం కొత్త ప్రభుత్వమైన సెగ్రిగేషన్ షెడ్లు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఆశిస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్యాచరణలో భాగంగా గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు శ్రీకారం చుట్టి గ్రామ పంచాయతీల ఆదాయం పెంపొందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లోని చెత్తను సేకరించి తడి,పొడి చెత్తను వేరు వేరుగా చేసి కంపోస్టు ఎరువులను తయారు చేయాలని సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలకు గాను ఒక్కొక్క గ్రామానికి రూ.2.50 లక్షల చొప్పున గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. గ్రామాలలో తడి, పొడి చెత్తను సేకరించి విడి విడిగా వేయడానికి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు ఆచరణకు ఆమడ దూరంలో ఉండడంతో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తీసుక వచ్చి తడి, పొడి చెత్తను కలిపి అక్కడే కాల్చివేస్తున్నారు. దీంతో జీపీల ఆదాయం పెంచడానికి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లను జీపీ సిబ్బంది వినియోగించక పోవడం..అధికారుల పర్యవేక్షణ లోపంతోనేనని... జిల్లాలో సర్వాత్రా నిరసన వ్యక్తమవుతుంది. దీంతో పంచాయతీల ఆదాయం పెంచడానికి కంపోస్టు ఎరువుల తయారీ కోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి.

చెత్త సేకరణకు ట్రాక్టర్ల కొనుగోలు

గ్రామాల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు గత ప్రభుత్వం జీపీలకు ట్రాక్టర్లను సమకూర్చింది. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తలో ఉన్న ప్లాస్టిక్, కాగితాలు, ఖాళీ సీసాల ద్వారా జీపీలకు కొంత వరకు ఆదాయం వస్తుందని ఆశించినా, అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్ష్యం నీరుగారిపోయింది.

ఆదాయ మార్గాలు ఇలా..

గ్రామాల్లో సేకరించిన చెత్తలో వచ్చే ప్లాస్టిక్ బాటిళ్లు, ఖాళీ సీసాలు, కాగితాలను వేరు చేసి విక్రయించడంతో వచ్చే ఆదాయన్ని గ్రామ పంచాయతీల ఖాతాకు జమ చేయాలి. ఆహార పదార్థాలు, కూరగాయలు తదితర వ్యర్థ పదార్థాలతో కంపోస్టు ఎరువులను తయారు చేసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కలు, నర్సరీల్లో ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. మిగిలిన ఎరువులను రైతులకు విక్రయించి వాటి నుంచి వచ్చిన డబ్బులను జీపీ ఖాతాల్లో వేసి గ్రామ అవసరాలకు వినియోగించుకోవాలి. కానీ ఇప్పటి వరకు షెడ్లలో అలాంటి పనులు ఆచరణకు ఆమడ దూరంలోనే నిలిచిపోయాయి. తడి,పొడి చెత్తను వేరు చేసి సేకరించేలా ప్రజలను చైతన్యపర్చిన అమలులో మాత్రం లక్ష్యం చేరుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చి కంపోస్టు ఎరు వులను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తడి,పొడి చెత్తను వేరు చేయడానికి విడి విడిగా నిర్మించిన చిన్న చిన్న షెడ్లు

బారులు తీరిన భక్తులు.. రద్దీగా మారిన గద్దెలు

● మేడారంలో కొనసాగిన దర్శనాలు ● లక్షకు పైగా తరలివచ్చిన భక్తజనం

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు గురువారం భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల వద్ద తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. కొబ్బరికాయలను కొట్టి యాట మొక్కులను చెల్లించుకున్నారు. తమ కోరికలను తీర్చాలని వనదేతలను వేడుకున్నారు. మేడారం పరిసరాల్లోని వసతి షెడ్లలో, అటవీ ప్రాంతాల్లోని చెట్లకింద వంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. భక్తులు గురువారం లక్షకు పైగా దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

ఇప్పటి వరకు 30 లక్షల మంది

మహాజాతర నేపథ్యంలో మేడారంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 30 లక్షల మంది వనదేతలను దర్శించుకుని ఉంటారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మహాజాతరకు సుమారు రెండు నెలల ముందుగానే భక్తులు మేడారం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





బంగారంతో వెళుతున్న మహిళలు



జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

(3వ పేజీ తరువాయి)

దర్శించుకుంటారని అన్నారు. ఇప్పటికే 30లక్షలకు పైగా మంది భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. ములుగు జిల్లా కోసం పోరాడిన ముంజాల భిక్షపతితో పాటుగా జాతర అభివృద్ధికి పాటుపడిన వారికే ఉత్సవ కమిటీలో స్థానం దక్కిందన్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలను కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన వారు వీరే..

చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అబ్బయ్య, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయి జగ్గారావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీగా నిర్వహించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా వనదేవతలను దర్శించుకొని చీరె, సారె సమర్పించారు. పారిశుధ్య నిర్వహణపై మేడారంలోని హరిత హోటల్ సమావేశ గదిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలని అన్నారు. జాతరలో, జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్ మాట్లాడుతూ.. జాతరలో నిర్వర్తించే అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని అన్నారు. జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది, యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే అధికారులు తప్పనిసారిగా ఈనెల 19న సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని అన్నారు. మహాజాతరలో పారిశుధ్య పనులు చేయడానికి 10సెక్టార్లు 60సబ్ సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీపీవో, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల జరుగుతాయని అన్నారు. ఫీల్డ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీవో స్థాయి అధికారిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, వివిధ జోన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్



మేడారంలోని ప్రధాన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ శివప్రాసద్‌తో కలిసి జాతర పరిసరాల్లోని వైద్య శిబిరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు అందిస్తున్న సేవల గురించి డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రధాన తాత్కాలిక ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మహాజాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అదించాలన్నారు. సరిపడా మందులను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్ జగదీశ్వర్, ఏటూరునాగారం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రేమ్‌సింగ్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై నేడు సమీక్ష

హనుమకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ ఐఎంఏ హాలులో జరిగే ఈ సమీక్షా సమావేశానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొననున్నారు. జాతీయ కార్యక్రమాల అమలును సమీక్షించనున్నారు. డీహెచ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో సమీక్షలో పాల్గొంటున్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆహార నాణ్యత అధికారుల తనిఖీలు

మేడారం, ఫిబ్రవరి 15: మహాజాతర నేపథ్యంలో ఆహార నాణ్యత అధికారులు మేడారంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వందల సంఖ్యలో వెలిసిన దుకాణాల్లోని ఆహార పదార్థాలను, తినుబండారాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం భక్తులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత శ్రీ, బాపుజీ, కృష్ణమూర్తి, రోహిత్‌రెడ్డి, వాసూరాం, ఎస్.అనూష, ఆర్.అనూష, ప్రత్యూష మేడారం జాతరలో విడివిడిగా తనిఖీలు చేశారు. రకరకాల రంగులు కలిపిన పదార్థాలను పరిశీలించారు. బాగా మరిగిన నూనెలు సమారు 15 లీటర్ల వరకు పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్


సేవాలాల్ జయంతి లో పాల్గొన్న గిరిజన నాయకులు


కొడకండ్లలో గిరిజనుల పూజలు


నర్మెటలో సేవాలాల్‌కు పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు


పాలకుర్తి : పూజల్లో పాల్గొన్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ అని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మసంద్రం కుంట తాండా గ్రామంలో గురువారం సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకొని భోగ్ బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఝాన్సీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి. మదార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు బీఎస్పీ, సేవాలాల్ మహారాజ్ ధర్మ పరిరక్షణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి తాళ్లపల్లి వెంకట స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంత రం కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుక్స్ అందచేశారు.

● జనగామ కల్చరల్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. గురువారం జనగామ మునిసిపాలిటీ పరిధి రెండో వార్డులో సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్ నేతృత్వంలో, కమిటీ అధ్యక్షుడు భూక్యా చందునాయక్ ఆధ్వర్యంలో జరిగింది. భోగ్ బండారో పూజారి మాలోత్ బిక్కు నాయక్, వాసు నాయక్, బానోతు హరిలాల్, వాంకుడోతు బీకోజీ, లకావత్ నరేష్, కొర్ర రాజేందర్, కాలూరాం, లాల్మ నా యక్, భూక్య బాలు, డాక్టర్ రఘు పాల్గొన్నారు. బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి నిర్వ హించారు. జిల్లా అధ్యక్షుడు బానోతు రామకోటి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ పార్కు ప్రాంతంలో భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, చౌడ రమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

● నర్మెట : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నర్మెట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, గిరిజన నాయకులు మహిళలు సేవాలాల్ చిత్రపటం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొన్నె రాజు, కార్యదర్శి సిద్దులు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు బుచ్చుల కొమురెల్లి, మురళి, పాల్గొన్నారు.

●దేవరుప్పుల : గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని దేవరుప్పుల మండల వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ధరావత్‌తండాలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి హాజరై భోగ్ బండార్ సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజనులకు శుభాకా ంక్షలు తెలిపారు. మండల పార్టీ యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనీల్, తోటకూరి రమేష్, నిఖిల్, రవీందర్, బీకోజీ, బిక్కు, రాజేష్, రమేష్, సోమన్న చంద్రశేఖర్, దేవానాయక్, గేమా తదితరులు పాల్గొన్నారు.

●కొడకండ్ల : మండలకేంద్రంలోని సేవాలాల్ దేవాల యానికి కేటాయించిన స్థలంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భోగబండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ జ్యోతి, తహసీల్దార్ అంజయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు శ్రీను నాయక్‌పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ మేకల వరలక్ష్మీతో పాటు పలువురు గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి, కావటి భాస్కర్, గుగులోతు కొంరెల్లి, జీడికంటి రాజ్‌కుమార్, ఎండి.అస్లాం, రమేష్, శ్రావణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

●జఫర్‌గడ్ : సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో లంబాడీలు పయనించాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు బానోత్ వసంత్ నాయక్ కోరారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం జఫర్‌గడ్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లంబాడ గిరిజన సంఘాల ప్రతినిధులు, గిరిజనులు పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గిరిజన సంఘాల ప్రతినిధులు భూక్య రవి నాయక్, జువారి రమేశ్, వాంకుడోత్ శంకర్, భూక్య నరెందర్, బానోత్ రవికుమార్, దర్గానాయక్ తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పులలో కాంగ్రెస్ నాయకుల పూజలు


రఘునాథపల్లిలో సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ


జఫర్‌గడ్ : సేవాలాల్ చిత్ర పటం వద్ద నివాళుల దృశ్యం

సర్వే 174లోని భూమి ప్రభుత్వానిదే..

ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నట్టు ఉత్తర్వులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 15: ఎన్నో సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలిచిన బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్ గ్రామ సమీపంలో గల సర్వే నంబర్ 174 వ్యవహారం కొలిక్కి వచ్చింది. సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనపర్చుకుంటున్నట్టు అధికారులు ఉత్తర్వులిచ్చారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న వ్యవహారం సమిసిపోయినట్టయ్యింది. హత్య.. హత్యాయత్నాలు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు.. తీన్మార్ మల్లన్న టీంల సందర్శనలు.. ఉమ్మడి వరంగల్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులచే పలుమార్లు విచారణలు.. సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసి పోరాటాలు.. భూసాధన సమితి పేరుతో ఉద్యమాలు.. ఇలా ఈ సర్వే నెంబర్ సంబంధించిన భూవ్యవహారం నిత్యం వార్తల్లో హల్‌చల్ చేసింది. సర్వే నెంబర్ 174లోని 8.23 ఎకరాల భూమికి సంబంధించి దశాబ్దాల క్రితమే తమ కుటుంబీకులు కొనుగోలు చేసి కబ్జాలో ఉన్నామని అది తమకే చెందుతుందని ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ భర్త అంజయ్య, మాజీ సర్పంచ్ పస్తం ధర్మయ్య కుటుంబాలకు చెందిన వారు వాదిస్తూ వచ్చారు. గతంలో పట్టాలో ఉన్నవారి వద్ద డబ్బులు కొనుగోలు చేసి తీసుకున్నారని, తమకే చెందుతుందని వాదించారు. కాగా ఇది గతంలో ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇచ్చిందని, వారి వారసుల చేతుల్లో కాకుండా, ఇతరులు కబ్జా చేశారంటూ, సీపీఎం, భూసాధన కమిటీ పేరుతో ఏర్పడిన సంఘం అధికారులకు ఫిర్యాదు చేసి పోరాటం కొనసాగించింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినందున స్వాధీనపర్చుకుని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని గుడిసెలు వేసే కార్యక్రమాలు చేశారు. అనేక మార్లు ఈ స్థలంలో తీవ్రస్థాయి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పికెట్‌లు ఏర్పాటు చేసి అల్లర్లు జరగకుండా అడ్డుకునేవారు. కాగా రిటైర్డ్ ఎంపీడీవో రామకృష్ణయ్య హత్యకు ఈ భూమి వ్యవహారం ఓ కారణమంటూ సీపీఎంతో పాటు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అధికారులు కబ్జా చేసినవారికి సహకరిస్తున్నారంటూ సీపీఎం నేతలు అనేకమార్లు ఆరోపణలు చేశారు. అనేక మందిపై అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. చివరకు జిల్లా అధికారులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నట్టు ఈనెల 10న ఉత్తర్వులు ఇవ్వగా, 14న వెలుగు చూసింది. దీంతో సీపీఎం, భూసాధన కమిటీ నేతలు బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఈ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి మరోమారు బోర్డులు పాతడం జరుగుతుందని తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు.

సమ్మక్క - సారలమ్మలకు మొక్కులు


ఎత్తు బెల్లం సమర్పిస్తున్న చిర్ర నాగరాజు

చిలుపూర్, ఫిబ్రవరి 15 : మండలంలోని లింగంపల్లి, చిలుపూర్ - మల్కాగుట్ట, శ్రీపతి పల్లి - కొండాపూర్, గార్లగడ్డ తదితర గ్రామాల్లో నెలకొన్న సమ్మక్క సారలమ్మ వన దేవతలకు భక్తులు మొక్కులు సమర్పిస్తున్నారు. గురువారం ఆయా జాతరలకు చెందిన చైర్మన్లు కండ్లకోలు బాలరాజు, బోళ్ల రాజ్‌కుమార్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, హుస్సేన్‌నాయక్‌తో పాటు, ఈవో చిందం వంశీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టగా, స్టేషన్‌ఘన్‌పూర్ - చిలుపూర్ ఉమ్మడి మండ లాలకు చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎత్తు బంగారాన్ని (బెల్లం) తూకం వేసి వన దేవతలకు సమర్పించారు. బత్తిని కొమురయ్య, నాగరాజు, వీరగోని అశోక్, చిర్ర రాజమౌళి, బాల్నె నాగరాజు, రాజు, అపరాధపు రాజు, గొడుగు కరుణాకర్, చాతెల్లి రజాక్ పాల్గొన్నారు.

మండల సమాఖ్యను సందర్శించిన అంతరాష్ట్ర అధికారుల బృందం


మండల సమాఖ్యలో పొదుపుల నిర్వహణను తెలుసుకుంటున్న అధికారులు

లింగాలఘణపురం, ఫిబ్రవరి15: లింగాల ఘణపురం మండల కేంద్రంలోని శుభాంజలి మండల సమాఖ్యను గురువారం నాలుగు రాష్ట్రాలకు చెందిన 23 మంది ఎస్‌ఎల్‌ఆర్‌ఎం అధికారుల బృందం సందర్శించింది. ఈసందర్భంగా శుభాంజలి మండల సమాఖ్య పనితీరును, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. . కార్యక్రమంలో అంతరాష్ట్ర అధికారులతో పాటుగా అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఆర్‌డీవో మొగులప్ప, డీపీఎం సమ్మక్క, ఏపీఎం శంకరయ్య, సీసీలు శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్, వెంకట్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్, మండల సమాఖ్య అధ్యక్షులు సంధ్య, వీవోఏలు రేవతి, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

ప్లాట్లు అప్పగించకుంటే గుడిసెలు వేస్తాం

- సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: జనగామ పట్టణంలోని మల్లన్నగుడి వద్ద 400, 401 సర్వే నంబర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి 20 ఏళ్లుగా స్థలం చూపించకుండా ఇద్దరు వ్యక్తులు మోసం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్లాట్లు అప్పగించకుంటే ఆ స్థలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయాలంటూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం ఆరో రోజుకు చేరాయి. దీక్షలకు జనగామ రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం మద్దతు తెలిపింది. సమస్య పరిష్కారానికి పట్టేదారులు ముందుకు రాకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, దామోదర్‌రెడ్డి, అంబటి నాగేశ్, జోగారెడ్డి, బత్తిని నర్సింహులు, ఎండబట్ల రాములు, ఖాదర్‌బాషా, పులిగిల్ల చంద్రయ్య, మానుపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులపై విచారణ జరిపించాలి

చిలుపూర్, ఫిబ్రవరి 15 : మండలంలోని పల్లగుట్ట పరిధిలోని 1, 2 వార్డుల్లో ఇటీవల లక్షలు వెచ్చించి వేసిన సీసీరోడ్లు నాసిరకంగా నిర్మించడంతో కంకరతేలి గుంతలమయంగా మారిందని, ఇట్టి నిర్మాణ పనులపై తక్షణమే తగు విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వేల్పుల గట్టయ్య అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అట్టి సీసీరోడ్డును స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్ వేసిన కొద్దినెలల వ్యవధిలోనే సీసీరోడ్డు గుంతలమయంగా మారడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో దార రజనీకుమార్, కుమారస్వామి, రాజు, దార అనిల్, యేసు, వెంకటయ్య, యాకోబు, కుమార్, చేరాలు పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం..

చిలుపూర్, ఫిబ్రవరి 15 : క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని చిలుపూర్ ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పల్లగుట్టలో రెండవలీగ్ మ్యాచ్ క్రికెట్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై వినయ్‌కుమార్ మాట్లాడారు. యువత చెడు పోకడలకు పోకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. దార రజనీకుమార్, రాజ్‌కుమార్, రమేష్, దార సతీష్, ఇసురం క్రిష్ణ, యేశోబు, నిరంజన్, అనిల్, సతీష్‌రెడ్డి, టింగ్, విష్ణు, మేఘూన్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల జన్మదినం సందర్భంగా అన్నదానం

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జనగామలో అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ చౌరస్తాలో పొన్నాల యువసేనా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం పాలకుర్తికి చెందిన ఎనుగుతల నాగరాజు అనే దివ్యాంగుడికి హైదరాబాద్‌లో నెల రోజుల వసతి కోసం రూ.6 వేల సాయాన్ని పొన్నాల లక్ష్మయ్య పంపించగా బీఆర్ఎస్ నాయకులు దివ్యాంగుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి శ్రీనివాస్, నీల రాంమనోహర్, నీల యాదగిరి, మల్లిగారి రాజు, ఎండీ.అన్వర్, ఎండీ.మాజిద్, గుర్రం నాగరాజు, శివరాజ్, గురువయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఎస్.శ్రీనివాస్, దేవరాయ నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలకు పుస్తకాల వితరణ

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 15: జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాత పుస్తకాలు వితరణ చేశారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాండ్ర ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత పందిరి శ్రీనివాస్ రూ.50 వేల విలువ గల 900 పుస్తకాలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమానికి నోడల్ అధికారి వంగాల రాజేందర్, క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ విజయపాల్ రెడ్డి, సీ.ఏ. ప్రసాద్, ఆమంచి లక్ష్మీ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి బుద్దా రమేష్, గ్రీన్ జనగామ అధ్యక్షుడు కాసాల సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు చొక్కయ్య, క్రిష్ణమూర్తి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్డీవో

జఫర్‌గడ్, ఫిబ్రవరి 15 : మండలంలోని కోనాయిచలం శివారులోని ప్రభుత్వ సీలింగ్ భూమిని గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రాంమూర్తి సందర్శించి పరిశీలించారు. కోనాయిచలం శివారులోని 161/సి /2 సర్వే నంబరులో ఉన్న 26 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమి గతంలో ఆక్రమణకు గురైంది. ప్రజా సంఘాలు సాగించిన ఉద్యమ నేపథ్యంలో ఆ భూమిని గత కొన్నేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ భూమిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వరద కాలువ మట్టిని పోసి, అధికారులు, నేతల అండదండలతో ప్రభుత్వ భూముల హద్దులను చెరిపేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని సీపీఐ, స్థానిక రైతులు ఆరోపిస్తూ, ఆ భూమిని పేదలకు పంచాలని, లేనిచో గుడిసెలు వేస్తామని ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజు, మండల సర్వేయర్ కరుణాకర్‌లతో కలిసి ఆర్డీఓ రాంమూర్తి 161 సర్వే నంబరులోని ప్రభుత్వ సీలింగ్ భూమిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని సమగ్రంగా కొలతలు నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయాలని ఆయన సర్వేయర్లను ఆదేశించారు. మూడు నాలుగు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

పేదల ఆశాజ్యోతి ధర్మభిక్షం


ధర్మభిక్షానికి నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: పేద ప్రజల ఆశాజ్యోతి, బడుగుల నాయకులు మాజీ ఎంపీ ధర్మభిక్షంగౌడ్ అని మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డి, గౌడ సంఘం నేత పాముకుంట్ల కుమారస్వా మిగౌడ్ కొనియాడారు. గురువారం ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని జనగామ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు దూలం రాంనర్సయ్య, బొమ్మగాని మురళీధర్‌గౌడ్, బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, ఆలేటి నరేందర్, డాక్టర్ కసాబు శ్రీను, బండపల్లి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మంగళంపల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి, నాయకులు సొప్పరి సోమయ్య, మోతే శ్రీశైలం, కేమిడి మల్లయ్య, బ్రహ్మం, సుదర్శనం, కుమారస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీజీఎల్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 15: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. జనగామ జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఐఈఓ భైరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాలి అశోక్, మాదంశెట్టి వరూధిని, కె.రాజేష్, ఎస్.జీవనజ్యోతి పాల్గొన్నారు.

18 నుంచి బోనాల కోలాటం శిక్షణ

లింగాలఘణపురం, ఫిబ్రవరి 15: మండలంలోని జీడికల్ శ్రీరామచంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో కళాకారుల కోసం ఈ నెల 18 నుంచి మార్చి 5 వరకు బోనాల కోలాటం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ మీడియాతో మాట్లాడుతూ ప్రజా కళల పరిరక్షణలో భాగంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పెరల్స్ ఆర్ట్ క్రియేషన్స్ సిద్దిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా కళాకారుల కోసం నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని మహిళా కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సూచించారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్ ఫిబ్రవరి 15: మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో ఎంపీ పసునూరి దయాకర్ నిధులు రూ. 3.5 లక్షలతో మంజూరైన రెండు హైమాస్ట్ లైట్లను గురువారం స్థానిక మాజీ సర్పంచ్ అనుమాల మల్లేశం ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

స్థానికులకే భవన నిర్మాణ పనులు అప్పగించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి15: ఆంధ్రా, బీహార్ వలస కూలీలకు కాకుండా స్థానికులకే భవన నిర్మాణ పనులను అప్పగించాలని స్టేషన్‌ఘన్‌పూర్ భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తాటికొండ మధు అన్నారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో సమావేశమైన భవననిర్మాణ కార్మిక సంఘం పలు తీర్మాణాలను చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో గోనెల రాజు, శాగ వీరయ్య, మునిగెల రాజు, రవి వెంకటస్వామి, లక్ష్మయ్య అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్టు షాపులు వద్దని తీర్మానం

దేవరుప్పుల, ఫిబ్రవరి15: సమాజం అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న మద్యం బెల్టు దుకాణాలు అవసరం లేదని సింగరాజుపల్లి గ్రామస్థులు గురువారం ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న దుకాణాదారులకు నోటీసులు అందించారు. ఉన్న నిల్వలను ఈ నెల 24వ తేదీ వరకు అమ్ముకోవాలని, ఆ తర్వాత నుంచి గ్రామంలో ఎలాంటి మద్యం అమ్మవద్దని సూచించారు. ఈ విషయంపై గ్రామంలోని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఇప్ప పృథ్వీరెడ్డి, కార్యదర్శి సంపత్, రాపాక యాదమ్మ, సోమనర్సమ్మ, శాంతమ్మ, మంజూల, లక్ష్మి, భాగ్యమ్మ, రేణుక, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కట్కూరు, బచ్చన్నపేట కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

బచ్చన్నపేట, ఫిబ్రవరి 15: మండలంలోని కట్కూరు, బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. చిన్నరామన్‌చర్ల కమిటీ సభ్యు మధ్య సయోధ్య కుదరకపోవడంతో వాయిదావేశారు. కట్కూరు గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా చింతల బాలయ్య, గుడుగుల సతీష్, ఉపాధ్యక్షులుగా కుంట్ల కర్ణాకర్, పుట్ట నర్సింహులు, తమ్మడి అంజనేయులు, బొజ్జ వెంకట్, టేకులపల్లి కుమార్, కార్యదర్శిగా బండి హన్మంతారెడ్డి, కోశాధికారిగా చౌహాన్ రమేశ్, సోషల్ మీడి యా పల్లపు మురళిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే బచ్చన్నపేట పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా కోడూరు మహాత్మాచారి, కర్రె నవీన్, ఉపాధ్యక్షులు గంధమాల కిష్టయ్య, కవ్వం రాజిరెడ్డి, లక్కర్సు వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎనుగుల కుమార్, యాకూబ్‌పాషా, కోశాధికారి మినలాపురం సిద్దులుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయా గ్రామాల కమిటీ నేతలన్నారు.

ద్విచక్ర వాహనం నుంచి మంటలు

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: ఉన్నట్టుండి ఒక్కసారిగా ద్విచక్రవాహనంలో మంటలు చెలరేగిన ఘటన జనగామ పట్టణంలో జరిగింది. జనగామ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోయించి టైర్లలో గాలి కొట్టించేందుకు హనుమకొండ రోడ్డులో గల ఓ షాపు వద్దకు వెళ్లాడు. గాలి కొట్టించేందుకు బైక్ డబుల్ స్టాండ్ వేయగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడున్న వారు ఇసుకతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా నిమిషాల్లో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చి నీళ్లు కొట్టడంతో మంటలు ఆరిపోయాయి.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 15 : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జఫర్‌గడ్ ఎస్ఐ మహేందర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గత మూడు రోజులుగా మండలంలోని ఇసుక పరివాహక ప్రాంతాలైన ఉప్పుగల్లు, కూనూరు, కోనాయిచలం, తిడుగులలోని ఆకేరు వాగుల్లో రెవెన్యూ, పోలీసు ఉద్యోగ సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేప ట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఆకేరు వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మొత్తం 8 ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించొద్దన్నారు.

టీఎన్‌జీవోస్ పట్టణ కమిటీ ఎన్నిక

జనగామ టౌన్, ఫిబ్రవరి 15: టీఎన్‌జీవోఎస్ యూనియన్ జనగామ పట్టణ కమిటీని గురువారం జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ సమక్షంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బి.రాజేశ్, కార్యదర్శిగా ఎం.మధు, కోశాధికారిగా సెలస్తనా, ఉపాధ్యక్షుడిగా రమేశ్, సహాయ కార్యదర్శులుగా నూరోద్దీన్, లక్ష్మీ, వినయ్, రాజు ఎన్నికయ్యారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

చిలుపూర్, ఫిబ్రవరి 15 : ప్రజల కనీస అవసరాలైనటువంటి తాగునీటి సరఫరాతో పాటు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ ప్రత్యేక అధికారి, మండల నాయబ్ తహసీల్దార్ విమల కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని కృష్ణాజీగూడెం, పల్లగుట్ట తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు ఆమె హాజరయ్యారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి15: స్టేషన్‌ఘన్‌పూర్ నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉమాదేవిని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ రామకృష్ణ, రమేశ్, ఈవో సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఎంపీపీ

లింగాలఘణపురం, ఫిబ్రవరి15: లింగాలఘణపురం మండలం బండ్లగూడెంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్‌రెడ్డి సందర్శించి పాఠశాల వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టులు రెండు ఖాళీలు ఏర్పడ్డాయని స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ వెంట ఎంపీడీవో జలందర్ రెడ్డి, సూపరింటెండెంట్ సీతారాంనాయుడు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో వైన్‌షాపు సీజ్

పాలకుర్తి, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలో దుర్గ వినాయక వైన్స్ యాజమాన్యం అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతుండగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు పాలకుర్తి ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వైన్ షాపులు సిండికేట్ కాగా బెల్ట్ షాపులకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతుండడంతో గత మూడు రోజుల క్రితం మద్యం షాపును సీజ్ చేసినట్లు తెలిపారు.

సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక బృందం


పాలకుర్తిలో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి, ఫిబ్రవరి 15 : సీసీ కెమెరాలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం లోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయడమే కాకుండా వాటిపై నిఘా పెట్టి నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా కళాశాలలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లల్లో చదువుకుంటున్న అందరికీ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సై యాకూబ్ హుస్సేన్, సిబ్బంది రవీందర్, యాంబరం, సోము, యాకయ్య, శ్రీనివాస్ భాస్కర్ తదితరులు ఉన్నారు.